సాక్షి
యాదాద్రి భువనగిరి
శుక్రవారం, 10, జనవరి, 2025



మతం పేరుతో విద్వేషాలు

మనుధర్మం, మతం పేరుతో బీజేపీ విద్వేషాలు సృష్టిస్తుందని పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క అన్నారు. - 8లో



భూ తగాదాలతోనే హత్య

భూతగాదాల నేపథ్యంలో వ్యక్తిని హత్య చేసిన నిందితులను సూర్యాపేట పోలీసులు అరెస్ట్ చేశారు. - 8లో



వసతులు కరువు

బీబీనగర్ రైల్వేస్టేషన్ నుంచి ప్రయాణికుల రద్దీ రోజురోజుకూ పెరుగుతున్నా స్టేషన్‌లో వసతులు మెరుగుపర్చడం లేదు. - 9లో

న్యూస్‌రీల్

యాదగిరీశుడికి సంప్రదాయ పూజలు

యాదగిరిగుట్ట : యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి క్షేత్రంలో గురువారం సంప్రదాయ పూజలు ఆగ్రమశాస్త్రం ప్రకారం నేత్రపరంగా చేపట్టారు. వేకువజామున ఆలయాన్ని తెరిచిన అర్చకులు.. సుప్రభాత సేవతో స్వామివారిని మేల్కొలిపారు. అనంతరం గర్భాలయంలోని స్వయంభూ, ప్రతిష్ఠా అలంకారమూర్తులకు నిజాభిషేకం, తులసీ దళాలతో అర్చన చేశారు. ఇక ప్రథమ ప్రాకార మండపంలో శ్రీసుదర్శన నారసింహహోమం, గజవాహన సేవ, నిత్యకల్యాణం, బ్రహ్మోత్సవం, ముఖ మండపంలో అష్టోత్తర పూజలు నిర్వహించారు.

నేడు సైలెన్స్ రిట్రీస్ సెంటర్ వార్షికోత్సవం



వార్షికోత్సవానికి ముస్తాబైన భవనాలు

బీబీనగర్: మండలంలోని మహదేవ్‌పురం పరిధిలో గల బ్రహ్మకుమారీస్ సైలెన్స్ రిట్రీస్ సెంటర్ రెండవ వార్షికోత్సవ వేడుకలు శుక్రవారం ప్రారంభంకానున్నాయి. వేడుకలకు బ్రహ్మకుమారీస్ అంతర్జాతీ కేంద్రం జనరల్ సెక్రటరీ బృజ్ మోహన్‌బాయిజీ, జాయింట్ చీఫ్ సంతోష్‌దీదీ ముఖ్య అతిథులుగా హాజరుకానున్నట్లు మహదేవ్‌పురం బ్రహ్మకుమారీస్ సెంటర్ డైరెక్టర్లు రాజ్‌కుమారీ, సునీత గురువారం తెలిపారు. స్పిర్చువల్ ట్రెనింగ్ కాంప్లెక్స్ ప్రారంభించడంతో పాటు యునైటెడ్ మైండ్స్ నూతన ప్రాజెక్ట్ ఆవిష్కరిస్తారని పేర్కొన్నారు.

తాజ్‌పూర్‌ను సందర్శించిన ఒడిశా బృందం



మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులతో ఒడిశా ప్రతినిధులు

భువనగిరి : మండలంలోని తాజ్‌పూర్ గ్రామాన్ని గురువారం ఒడిశా రాష్ట్ర ప్రతినిధుల బృందం సందర్శించింది. ఈ సందర్భంగా గ్రామంలోని మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులతో సమావేశం అయ్యారు. సంఘాల ఏర్పాటు, నిర్వహణ, పొదుపు, బ్యాంకుల నుంచి రుణాలు తీసుకుని చెల్లించడంపై అధ్యయనం చేశారు. రుణం డబ్బులతో చేస్తున్న వ్యాపారాలు, లాభాల గురించి తెలుసుకున్నారు. అలాగా ఆన్‌లైన్ ద్వారా జరిగే కార్యకలాపాలను ల్యాప్‌టాప్‌లో ప్రత్యక్షంగా పరిశీలించారు. కార్యక్రమంలో అడిషనల్ డీఆర్‌డీఓ శ్రీనివాస్, డీపీఎం శ్రీనివాస్, స్త్రీనిధి ఆర్ఎం రామకృష్ణ, ఏపీఎం అంజయ్య, సీసీ అప్సరబేగం, స్త్రీనిధి మేనేజర్లు అనిత తదితరులు పాల్గొన్నారు.



భూమికి భూమి ఇవ్వండి

ప్రాజెక్టులు, రహదారుల నిర్మాణంలో అటవీశాఖకు ఇస్తున్న మాదిరిగానే రీజనల్ రింగ్ రోడ్డు నిర్వాసితులకు భూమికి భూమి ఇవ్వాలని కోరుతూ గురువారం చౌటుప్పల్ ఆర్డీఓ కార్యాలయ డీఏఓ శ్రీనివాసకుమార్‌కు వినతిపత్రం అందజేస్తున్న భూ నిర్వాసితుల సంఘం కన్వీనర్ చింతల దామోదర్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ పెద్దిటి బుచ్చిరెడ్డి, సింగిల్‌విండో చైర్మన్ చీరిక సంజీవరెడ్డి తదితరులు -చౌటుప్పల్

కొనేవారే లేరు!

అత్యవసరమైతే అగ్గువకే అమ్మేస్తున్నారు

వ్యవసాయ భూములు, ప్లాట్లకు తగ్గిన డిమాండ్

- ఏడాది కాలంగా మందగించిన క్రయవిక్రయాలు
- ఆర్థికంగా ఇబ్బందులు
- అవసరాల కోసం ఎంతకోకొంతకు అమ్మకం



సాక్షి యాదాద్రి : జిల్లాలో వ్యవసాయ భూములు, ప్లాట్లకు డిమాండ్ తగ్గింది. ఏడాది కాలంగా క్రయవిక్రయాలు మందగించాయి. పిల్లల చదువులు, వివాహాలు, విదేశాలకు పంపడానికి డబ్బుల కోసం ప్లాట్లు అమ్ముకోవాలనుకునే వారు ఇబ్బందులు పడుతున్నారు. ఆర్థిక అవసరాల కోసం ఎంతకో కొంతకు అమ్ముకుంటున్నారు. రియల్ ఎస్టేట్ వ్యాపారులు తీవ్రమైన ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. విధిలేని పరిస్థితుల్లో సగం ధరకే అమ్మేసుకుంటున్నారు. జిల్లాలో వేలాది ఎకరాల వ్యవసాయ భూములు, లక్షల సంఖ్యలో ఓపెన్ ప్లాట్లు అమ్మకానికి ఉన్నాయి. పదేళ్ల తర్వాత పెరగాల్సిన ధరలు రియల్ ఎస్టేట్ వ్యాపారుల మాయాజాలంతో ఇప్పుడే పెరగడం కూడా కొనుగోళ్లు మందగించడానికి కారణమని తెలుస్తోంది. ఆర్థిక ఇబ్బందులు కారణంగా తక్కువగా రేటుకు భూములు విక్రయించాల్సిన దుస్థితి ఏర్పడిందని యజమానులు వాపోతున్నారు.

ఉదాహరణలు కొన్ని..

- యాదగిరిగుట్ట ప్రాంతానికి చెందిన ఓ వ్యక్తికి వంగపల్లిలో ఎకరం భూమి ఉంది. ఏడాది క్రితం అమ్మకానికి పెట్టాడు. రూ.కోటి 80 లక్షలు బేరం వచ్చినా విక్రయించలేదు. రేటు ఇంకా పెరుగుతుందన్న ఆశతో వేచి చూశాడు. కానీ, ధర పెరగక పోగా తగ్గుతూ వచ్చింది. అవసరాలకు డబ్బులు అత్యవసరం కావడంతో తప్పనిపరిస్థితిలో రూ.కోటి 40 లక్షలకు విక్రయించాడు.
- యాదగిరిగుట్ట మండలం మహబూబ్‌పేటలో గత ఏడాది కొందరు రైతులు కలిసి నాలుగు ఎకరాల భూమిని ఎకరం రూ.60 లక్షల చొప్పున ఓ రియల్ ఎస్టేట్‌కు వ్యాపారికి విక్రయించారు. అట్టి భూమిని సదరు రియల్టర్ అమ్మకానికి పెట్టగా ఎవ్వరూ కొనుగోలు చేయలేదు. దీంతో భూమి విక్రయించిన రైతులకు డబ్బులు చెల్లించలేకపోయాడు. అదే స్థలాన్ని రైతులు మరలా అమ్మకానికి పెట్టారు. డిమాండ్ తగ్గడంతో ఇటీవల ఎకరం రూ.45 లక్షల చొప్పున విక్రయించారు.
- భువనగిరి పట్టణ శివారులోని ఓ వెంచర్‌లో గత ఏడాది గజం రూ.30 వేలు పలికింది. అవసరం కోసం ఇటీవల ఓ వ్యక్తి గజం రూ.23 వేల చొప్పున విక్రయించాడు. గజానికి రూ. 7వేలు నష్టపోయాయని సదరు వ్యక్తి ఆవేదన వ్యక్తం చేశాడు.
- భువనగిరిలోని టీచర్స్ కాలనీలో ఒక వ్యక్తికి 150 గజాల ప్లాట్ ఉంది. ఈ ప్లాట్ పక్కనే గత ఏడాది గజానికి రూ. 25,000 ధర పలికింది. ఇటీవల సదరు వ్యక్తి తన ప్లాట్‌ను అమ్మకానికి పెట్టగా కొనుగోలు చేయడానికి ఎవ్వరూ ముందుకు రాలేదు. అవసరాల నిమిత్తం గజం రూ.19 వేల చొప్పున విక్రయించాడు.
- ఆలేరు పట్టణంలోని బస్టాండ్ వెనక పాత సినిమా థియేటర్ సమీపంలో మూడు సంవత్సరాల క్రితం గజం రూ.22వేలు పలికింది. ఆ తరువాత రూ.18 వేలు, ప్రస్తుతం రూ..10 వేలకు పడిపోయింది. గజం రూ.22వేలకు కొనుగోలు చేసిన వ్యక్తి డబ్బులు అత్యవసరం ఉండడంతో ఇప్పుడు రూ.14 వేలకే విక్రయించాడు. ఇతనితో పాటు మరికొందరు తమ అవసరాల కోసం తక్కువ ధరకు విక్రయించేందుకు సిద్ధపడ్డారు.

నేడే వైకుంఠ ఏకాదశి



యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలోని ఉత్తర మాడ వీధిలో ఏర్పాటు చేసిన గ్యాలరీలు

ముస్తాబైన వైష్ణవ క్షేత్రాలు

- స్వామివారి ఉత్తర ద్వార దర్శనానికి ప్రత్యేక ఏర్పాట్లు

సాక్షి, యాదాద్రి : వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకుని జిల్లాలోని వైష్ణవ ఆలయాలు ముస్తాబయ్యాయి. శుక్రవారం ఉదయం ఉత్తర ద్వారం గుండా భక్తులకు స్వామివారు దర్శనం ఇవ్వనున్నారు. యాదగిరిగుట్ట, స్వర్ణగిరి, మత్స్యగిరి, ఆలేరులోని రంగనాయక, వేణుగోపాలస్వామి.. ఇలా వివిధ ఆలయాలకు తెల్లవారుజాము నుంచే భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చే అవకాశం ఉంది. భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఆలయ కమిటీలు, అధికారులు ఏర్పాట్లు చేశారు.

గుట్టలో ఉదయం 5.15 గంటలకు ఉత్తర ద్వార దర్శనం

యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి క్షేత్రంలో శ్రీస్వామి వారు ఉదయం 5.15 గంటలకు ఉత్తర రాజగోపురం నుంచి వైకుంఠనాథుడిగా భక్తులకు దర్శనం ఇవ్వనున్నారు. ఉత్తర మాడ వీధిలో వీఐపీలు, భక్తుల కోసం ప్రత్యేక గ్యాలరీలు ఏర్పాటు చేశారు. సుమారు 5 వేల మంది కూర్చునేందుకు వీలుగా కుర్చీలు ఏర్పాటు చేశారు. గత ఏడాది 6 వేల మంది భక్తులు ఉత్తర ద్వార దర్శనానికి వచ్చారని, ఈసారి 10 వేలమంది వచ్చే అవకాశం ఉందని దేవస్థానం అధికారులు అంచనా వేస్తున్నారు.

ముస్తాబైన 'స్వర్ణగిరి'


భువనగిరి సమీపంలోని స్వర్ణగిరి క్షేత్రం వైకుంఠ ఏకాదశికి సర్వాంగ సుందరంగా ముస్తాబైంది. ప్రధానాలయాన్ని పండ్లు, పూలు, విద్యుత్ దీపాలతో అలంకరించారు. ఉదయం 5.30 నుంచి స్వామి వారి దర్శన భాగ్యం కల్పించనున్నారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా క్యూలైన్లలో తాగునీరు, మజ్జిగ, బిస్కెట్లు, అన్నప్రసాదం అందజేయనున్నారు.

మత్స్యగిరిలో..

మత్స్యగిరి ఆలయంలో స్వామివారి ఉత్తర ద్వార దర్శనం కోసం రెండు వేల మంది భక్తులు వచ్చే అవకాశం ఉందని దేవస్థానం అధికారులు అంచనా వేశారు. అందుకు అనుగుణంగా ఏర్పాట్లు చేశారు.

ఆలేరులోని శ్రీరంగనాథస్వామి ఆలయంలో..

ఆలేరులోని శ్రీ లక్ష్మీగోదా సమేత రంగనాయకస్వామి ఆలయాన్ని ప్రత్యేకంగా అలంకరించారు. ఉదయం 5 గంటలకు స్వామివారిని ఉత్తర ద్వార దర్శనానికి ఉంచుతారు.



గుట్ట క్షేత్రంలో ఉత్తర ద్వారం

ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు

యాదగిరిగుట్ట, స్వర్ణగిరి క్షేత్రాలకు వీఐపీలతో పాటు సాధారణ భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చే అవకాశం ఉండడంతో ఆలయాల అధికారులు, యాజమాన్యాలు పటిష్ట ఏర్పాట్లు చేశాయి. భక్తులకోసం అన్న ప్రసాదం, స్వామివారి మహాప్రసాదం, మంచినీటి సౌకర్యం కల్పించనున్నారు. అలాగే వాహనాల కోసం పార్కింగ్ స్థలాలు సిద్ధం చేశారు. ఫస్ట్ ఎయిడ్, అగ్నిమాపక వాహనాలను అందుబాటులో ఉంచారు. క్యూలైన్లలో ఎమర్జెన్సీ ఎగ్జిట్‌లు ఏర్పాటు చేశారు. రాష్ట్ర మంత్రులు వచ్చే అవకాశం ఉండడంతో ఆలయాల వద్ద పోలీస్‌శాఖ ప్రత్యేక ఏర్పాట్లు చేసింది.



పూలు, విద్యుత్ దీపాలంకరణలో భువనగిరిలోని స్వర్ణగిరి క్షేత్రం

అలసత్వం వహిస్తే సహించేది లేదు

- కలెక్టర్ ఆకస్మిక తనిఖీలు
- ముగ్గురు వైద్యసిబ్బందికి షోకాజ్ నోటీసులు



బొమ్మలరామారం పీహెచ్‌సీలో సిబ్బందితో మాట్లాడుతున్న కలెక్టర్ హనుమంతరావు

బొమ్మలరామారం : విధుల పట్ల అలసత్వం వహిస్తే సహించబోనని కలెక్టర్ హనుమంతరావు హెచ్చరించారు. బొమ్మలరామారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని గురువారం ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. పలువురు సిబ్బంది అందుబాటులో లేకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. అనుమతిలేకుండా విధులకు హాజరుకాని వైద్యాధికారి, ట్యాబ్ టెక్నీషియన్, ఎంపీహెచ్ఎస్‌లకు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. అత్యవసర విభాగంలో సిబ్బంది అందరూ అందుబాటులో ఉండాలని ఆదేశించారు. రోగులకు మెరుగైన సేవలు అందజేయాలని, వైద్య పరీక్షల కోసం ప్రైవేట్ ల్యాబ్‌లకు పంపితే చర్యలు తప్పవని హెచ్చరించారు. డిసెంబర్‌లో ఏడు డెలివరీలు మాత్రమే జరిగాయని, పెంచాలని సూచించారు. అనంతరం స్థానిక తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించారు. ధరణి దరఖాస్తుల పరిష్కారంపై సమీక్షించారు. రిజిస్ట్రేషన్ కోసం వచ్చిన రైతులతో మాట్లాడి సమస్యలు సకాలంలో పరిష్కారం అవుతున్నాయా అని తెలుసుకున్నారు. ఆయన వెంట తహసీల్దార్ శ్రీనివాస్‌రావు, ఎంఆర్ఐ వెంకట్‌రెడ్డి, పీహెచ్‌సీ డాక్టర్ సమలత ఉన్నారు.

టెన్త్‌లో ఉత్తమ ఫలితాలు సాధించాలి

ఆత్మకూరు(ఎం): పదో తరగతి వార్షిక పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలని డీఈఓ సత్యనారాయణ విద్యార్థులకు సూచించారు. గురువారం ఆత్మకూర్(ఎం) మండలంలోని పల్లెర్ల, కూరెళ్ల జిల్లా పరిషత్ ఉన్నత, ప్రాథమిక పాఠశాలలను తనిఖీ చేశారు. పాఠశాలల్లోని రికార్డులను పరిశీలించారు. ఉపాధ్యాయులతో సమావేశమై ప్రత్యేక తరగతుల నిర్వహణపై సమీక్ష నిర్వహించారు. చదువులో వెనుబడిన విద్యార్థులను గుర్తించి వారిపై శ్రద్ధ వహించాలని సూచించారు. అనంతరం మధ్యాహ్నభోజనాన్ని పరిశీలించారు. మెనూ ప్రకారం వారంలో మూడుసార్లు కోడిగుడ్డు అందజేయాలని సూచించారు. వంట ఏజెన్సీలకు పేపర్ ధరకు గుడ్డు సరఫరా చేయాలని కోరినట్లు పేర్కొన్నారు. కూరెళ్ల పాఠశాలలో విద్యార్థులతో కలసి భోజనం చేశారు. ఆయన వెంట హెచ్ఎంలు డాక్టర్ కె.శ్రీనివాసరావు, మిర్యాల దామోదర్, కట్టా రమేష్, సిబ్బంది, వెంకటనర్సయ్య, శంకర్, విజయ్‌కుమార్, షమీమ్, త్యాగరాజచారి, సహీన, నాగమల్లు, విజయ ఉన్నారు.



కూరెళ్ల పాఠశాలలో వంటలను పరిశీలిస్తున్న డీఈఓ సత్యనారాయణ

యూనివర్సిటీ అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం

- రూ.260 కోట్లతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు
- వచ్చే విద్యా సంవత్సరంలో కొత్త కోర్సులు ప్రారంభం
- ఎంజీయూ వీసీ అల్తాఫ్ హుస్సేన్



మాట్లాడుతున్న ఎంజీయూ వీసీ

నల్లగొండ టూటౌన్: మహాత్మాగాంధీ యూనివర్సిటీ అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించామని, ఈమేరకు రూ.260 కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపినట్లు యూనివర్సిటీ వీసీ ఖాజా అల్తాఫ్ హుస్సేన్ తెలిపారు. గురువారం ఎంజీయూలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. యూనివర్సిటీ పనివేళలు ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్ణయించామన్నారు. విద్యార్థులకు 75శాతం హాజరు తప్పనిసరి చేశామన్నారు. అదేవిధంగా డిటెన్షన్ విధానాన్ని ప్రవేశపెట్టినట్లు చెప్పారు. ఎంజీయూలో స్వయం ఉపాధి కోర్సులన్నింటినీ గ్రాంట్ ఇన్ ఎయిడ్ కోర్సులుగా మార్చేందుకు నిర్ణయించామని, వచ్చే విద్యా సంవత్సరంలో గవర్నర్స్ అండ్ పబ్లిక్ పాలసీ, లా, డెవలప్‌మెంట్ స్టడీస్ లాంటి కొత్త కోర్సులు ప్రవేశపెడతామని తెలిపారు. ల్యాబ్ పరికరాలు, తరగతి గదుల డిజిటలైజేషన్ ద్వారా 24 గంటల సేవలు అందించాలని నిర్ణయించామన్నారు. జిల్లా యువత నైపుణ్యాభివృద్ధికి స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ నిర్మాణం చేపట్టేందుకు రూ.30 కోట్లతో ప్రతిపాదనలు పంపామని తెలిపారు. స్పోర్ట్స్ ఫీల్డ్ అభివృద్ధి, ఇండోర్ స్టేడియం ఆధునీకరణ, నూతన అడ్మినిస్ట్రేషన్ బిల్డింగ్, అంతర్గత రోడ్ల నిర్మాణం, నూతన క్యాంటీన్, తదితర వాటి కోసం ప్రతిపాదనలు రూపొందించామన్నారు. మెస్ ఘటనపై పూర్తి స్థాయి దర్యాప్తు జరిపి తగిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

ఆన్‌లైన్‌లో మోడల్ స్కూల్ అడ్మిషన్లు

భూదాన్‌పోచంపల్లి : మున్సిపాలిటీ పరిధిలో గల పోచంపల్లి మోడల్‌స్కూల్‌లో 2025–26 విద్యా సంవత్సరానికి గాను 6నుంచి 10వ తరగతి వరకు ఆన్‌లైన్‌లో అడ్మిషన్లు స్వీకరిస్తున్నామని ప్రిన్సిపల్ నవీన్ కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 6 నుంచి ఫిబ్రవరి 28లోపు అర్హులైన విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈడబ్ల్యూఎస్ విద్యార్థులకు రూ.125, ఇతర విద్యార్థులు రూ.200 పరీక్ష ఫీజు ఆన్‌లైన్‌లో చెల్లించాలని పేర్కొన్నారు. ఏప్రిల్ 13న 6వ తరగతి విద్యార్థులకు ఉదయం 10నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, 7వ తరగతి నుంచి పదో తరగతి విద్యార్థులకు మధ్యాహ్నం 2నుంచి సాయంత్రం 4 గంటల వరకు అడ్మిషన్ టెస్ట్ ఉంటుందన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

బీజేపీలో అధ్యక్ష పదవికి పోరు!

ఎనిమిది మంది వరకు పోటీ

- తనకు మరో చాన్స్ ఇవ్వాలంటున్న ప్రస్తుత అధ్యక్షుడు పాశం భాస్కర్
- పండుగ తరువాత అభిప్రాయ సేకరణ
- 12లోపు మండల, మున్సిపాలిటీ అధ్యక్షుల ఎన్నిక పూర్తి



సాక్షి,యాదాద్రి : బీజేపీ జిల్లా అధ్యక్ష పదవికి తీవ్ర పోటీ నెలకొంది. ఎనిమిది మంది వరకు ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారు. కాగా స్వల్పకాలమే తాను అధ్యక్ష పదవిలో కొనసాగానని, మరో చాన్స్ ఇవ్వాలని ప్రస్తుత జిల్లా అధ్యక్షుడు పాశం భాస్కర్ రాష్ట్ర నాయకత్వాన్ని కోరుతున్నారు. ఆశావహులు ఎక్కువగా ఉన్నందున సంక్రాంతి తరువాత అభిప్రాయ సేకరణ చేసి జిల్లా అధ్యక్షున్ని నియమించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఇదిలా ఉండగా మండల, మున్సిపాలిటీల అధ్యక్షుల నియామకం రెండు రోజుల్లో పూర్తి కానుంది. వీరికి సంబంధించి ఇప్పటికే రాష్ట్ర నాయకత్వానికి జాబితా చేరింది.

పోటీపడుతున్నది వీరే..

ప్రస్తుతం జిల్లా అధ్యక్షుడు పాశం భాస్కర్‌తోపాటు మరికొందరు అధ్యక్ష పదవికోసం పోటీ పడుతున్నారు. పాశం భాస్కర్ తనకు మరో అవకాశం ఇవ్వాలని పార్టీని కోరుతున్నారు. ఇందుకు రాష్ట్ర నాయకత్వం సానుకూలంగా ఉన్నట్లు సమాచారం. ఇక బీజేపీ జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి, త్రిపుర ఏబీవీపీ నార్త్ ఈస్ట్ సెక్రటరీగా పనిచేసిన బొమ్మల రామారం మండలం చౌదరిపల్లికి చెందిన రామిడి బాలకృష్ణారెడ్డి తాజాగా ప్రయత్నాలు ప్రారంభించారు. ఆర్ఎస్ఎస్‌తో పాటు బీజేపీలోని కీలక నేతల మద్దతుతో ప్రయత్నిస్తున్నారు. వీరితో పాటు ఎం.రాజశేఖర్‌రెడ్డి, పి.జగన్‌మోహన్‌రెడ్డి, పడాల శ్రీనివాస్, మరికొందరు అధ్యక్ష పదవి ఆశిస్తున్నారు.

మెజార్టీ సభ్యుల అభిప్రాయం మేరకు..

స్క్రీనింగ్ కమిటీలో మెజార్టీ సభ్యుల అభిప్రాయం ప్రకారం జిల్లా అధ్యక్షుడిని నియమించనున్నారు. సంక్రాంతి తర్వాత సమావేశం ఏర్పాటు చేసి అధ్యక్షుడి ఎన్నిక ప్రక్రియ ప్రారంభించనున్నారు.మండలాలు, పట్టణ అధ్యక్షులతో పాటు పార్టీకి సేవలందించిన సీనియర్ నాయకులను జిల్లా కౌన్సిల్ సభ్యులుగా నియమించనున్నారు. వీరు కూడా అధ్యక్షుని పేరు ప్రతిపాదిస్తారు. జిల్లాకు చెందిన రాష్ట్ర కమిటీ సభ్యులు, రాష్ట్ర మోర్చా సభ్యులు సైతం అధ్యక్షుని పేరు ప్రతిపాదిస్తారు. మెజార్టీ అభిప్రాయం మేరకు రాష్ట్ర కమిటీకి ముగ్గురి పేర్లు పంపిస్తారు. రాష్ట్రస్థాయిలో కోర్‌కమిటీ సమావేశమై జిల్లా అధ్యక్షున్ని ప్రకటిస్తారు. ఈనెల 16వ తేదీ వరకు ప్రక్రియ పూర్తికానుంది.

రెండు రోజుల్లో మండల, పట్టణాలకు..

ఆలేరు, భువనగిరి నియోజకవర్గాల్లో 12 కమిటీల అధ్యక్షులను ప్రకటించడం సాంకేతిక సమస్యలతో ఆగిపోయింది. ఆలేరు పట్టణం, ఆలేరు మండలం అధ్యక్షుల పేర్లు ఖరారు కాకపోవడంతో పెండింగ్ పడింది. ఈనెల 12లోపు మండల, మున్సిపాలిటీ అధ్యక్షుల నియామకం పూర్తికానుంది.

దేశ రక్షణలో భాగస్వాములు కావాలి

- కల్నల్ అనిల్‌కుమార్



మాట్లాడుతున్న కల్నల్ అనిల్‌కుమార్, వేదికపై ధర్మవరం మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి

బొమ్మలరామారం : యువత దేశ రక్షణలో భాగస్వాములు కావాలని హైదరాబాద్ గ్రూప్ ఎన్‌సీసీ కమాండర్ కల్నల్ అనిల్‌కుమార్ సూచించారు. బొమ్మలరామారం మండలంల రంగాపూర్‌లో గల హైదరాబాద్ డిఫెన్స్ అకాడమీలో గురువారం సీనియర్ విద్యార్థులకు నిర్వహించిన వీడ్కోలు సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రక్షణ రంగంలో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు అపారంగా ఉన్నాయని, వాటిని యువత అందిపుచ్చుకుని మాతృభూమి సేవలో తరించాలని కోరారు. విద్యార్థులు కలలు కని, వాటిని సాకారం చేసుకోవాలన్నారు. ఆంధ్రప్రదేశ్‌లోని ధర్మవరం మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరమణారెడ్డి మాట్లాడుతూ ఒత్తిడి లేని విద్యాబోధన చేయడం వల్ల విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధిస్తారని పేర్కొన్నారు. హైదరాబాద్ డిఫెన్స్ అకాడమీలో నైపుణ్యం గల ఫ్యాకల్టీలతో పాటు విద్యార్థులతో మమేకమయ్యే యాజమాన్యం విశాలమైన క్రీడా ప్రాంగణం ఉండడంతో ఎక్కువమంది విద్యార్థులు కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలు సాధిస్తున్నారని వెల్లడించారు. కష్టపడి కాకుండా ఇష్టపడి చదివితే అనుకున్న లక్ష్యాలను చేరుకోవచ్చన్నారు. కళాశాల చైర్మన్ డాక్టర్ రాజ్‌కుమార్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఐపీఎస్ అధికారి ప్రణయ్‌సందీప్, రిటైర్డ్ కల్నల్ ఎస్.కే.దాస్, డైరెక్టర్ నవ్యశ్రీ, ప్రిన్సిపాల్ అంజయ్య, చీఫ్ మానిటర్ ఆర్‌కే రావు, శ్రీశైలం, అధ్యాపకులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఇంటర్నేషనల్ జర్నల్‌లో పరిశోధనా పత్రం ప్రచురితం



దామెర శ్రీనివాస్

తిరుమలగిరి (తుంగతుర్తి): తిరుమలగిరి మండల కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్ గెజిటెడ్ హెడ్మాస్టర్ దామెర శ్రీనివాస్ 'ఏ స్టడీ ఆన్ జాబ్ సాటిస్ఫాక్షన్ అండ్ ప్రొఫెషనల్ పెర్మార్మెన్స్ అమాంగ్ సెకండరీ స్కూల్ టీచర్స్' అనే అంశంపై చేసిన పరిశోధనా పత్రం మహారాష్ట్రకు చెందిన ప్రొ. వినయ్ శంకర్‌రావు హేటోల్ సంపాదకత్వంలోని రాయల్ ఇంటర్నేషనల్ మల్టీ డిసిప్లినరీ రీసెర్చ్ జర్నల్‌లో ప్రచురితమైంది. దామెర శ్రీనివాస్‌ను గురువారం విద్యాశాఖ జిల్లా ఉన్నతాధికారులు, తిరుమలగిరి మండలానికి చెందిన వివిధ ఉపాధ్యాయ సంఘాల నాయకులు సోమయ్య, బోసుబాబు, జానయ్య, పాఠశాల ఉపాధ్యాయులు, ఎంఈఓ శాంతయ్య, గెజిటెడ్ హెచ్ఎంలు మాశెట్టి శ్రీనివాసులు, అశోక్‌రెడ్డి, సీపీఎస్ ఎంప్లాయిస్ నాయకుడు మేడబోయిన లింగయ్య అభినందించారు.

జాతీయ బీచ్ హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపిక



జహంగీర్ బాబా

తిప్పర్తి: మండల కేంద్రానికి చెందిన ఎండీ జహంగీర్ బాబా జాతీయ బీచ్ హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపికయ్యాడు. అస్సాం రాష్ట్రంలో శుక్రవారం జరిగే జాతీయస్థాయి సీనియర్ పురుషుల బీచ్ హ్యాండ్‌బాల్ పోటీల్లో జహంగీర్ బాబా పాల్గొననున్నట్లు జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు నర్సింహారావు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

మురుగు కాల్వలో పడి వ్యక్తి మృతి

చిట్యాల: మద్యం మత్తులో మురుగు కాల్వలో పడి వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన చిట్యాల మున్సిపాలిటీ పరిధిలో గురువారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. చిట్యాల పోలీస్ స్టేషన్ హెడ్‌కానిస్టేబుల్ పాష తెలిపిన వివరాల ప్రకారం.. చిట్యాల పట్టణంలోని ముత్యాలమ్మ గూడేనికి చెందిన ఎండీ జావీద్(40) మద్యానికి బానిసై తరచూ కుటుంబ సభ్యులతో గొడవ పడుతుండేవాడు. బుధవారం అతడు హైదరాబాద్‌కు వెళ్తున్నానని ఇంట్లో చెప్పి బయటకు వచ్చాడు. గురువారం ఉదయం శివనేనిగూడేనికి వెళ్లే రోడ్డులో రేణుకా ఎల్లమ్మ గుడి సమీపంలో మురుగు కాల్వలో జావీద్ మృతిచెంది ఉండటాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు మృతుడి భార్య షాహీనాకు సమాచారం ఇచ్చారు. గురువారం మృతుడి భార్య షాహీనా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

లారీని ఢీకొట్టిన బైక్

- ఇద్దరికి గాయాలు

చౌటుప్పల్ రూరల్: రోడ్డు పక్కన ఆగి ఉన్న లారీని బైక్ ఢీకొట్టడంతో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటన చౌటుప్పల్ మండలం ధర్మోజిగూడెం గ్రామ స్టేజీ వద్ద గురువారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నల్లగొండ మున్సిపాలిటీ పరిధిలోని పానగల్లుకు చెందిన చింత దిలీప్ తన బంధువు అయిన కట్టంగూర్‌కు చెందిన సుక్క స్వాతి కలిసి హైదరాబాద్ నుంచి బైక్‌పై వస్తుండగా.. మార్గమధ్యలో ధర్మోజిగూడెం గ్రామ స్టేజీ వద్ద రోడ్డు పక్కన ఆగి ఉన్న లారీని వెనుక నుంచి ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో దిలీప్, స్వాతికి తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం వారిని చౌటుప్పల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారన్నీ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ కృష్ణమాల్ సూర తెలిపారు.

మతం పేరుతో ప్రజల మధ్య విద్వేషాలు

- ఆదివాసీ గిరిజనుల చట్టాలను కాలరాస్తున్న బీజేపీ
- పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క



ఆదివాసీ గిరిజనుల అటవీ హక్కులను వివరిస్తున్న మంత్రి సీతక్క

నాగార్జునసాగర్: మనుధర్మం, మతం పేరుతో బీజేపీ ప్రభుత్వం ఆదివాసీ గిరిజనుల మధ్య విద్వేషాలు సృష్టిస్తుందని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ శిశు సంక్షేమ శాఖమంత్రి సీతక్క అన్నారు. గిరిజనుల సంక్షేమం కోసం దేశంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నో పథకాలు, చట్టాలను తీసుకువచ్చిందని అన్నారు. గడిచిన పదేళ్ల కాలంలో బీజేపీ ప్రభుత్వం ఆ చట్టాలను నిర్వీర్యం చేసిందన్నారు. నాగార్జునసాగర్ ప్రాజెక్టు హౌస్‌లో జాతీయ స్థాయిలో నిర్వహిస్తున్న గిరిజన సంఘాల వర్క్‌షాప్‌లో ఆమె గురువారం పాల్గొని మాట్లాడారు. ప్రస్తుత కేంద్ర ప్రభుత్వం అటవీ సంపదను, భూములను స్థానికులకు దక్కకుండా మైనింగ్‌పేరుతో అదాని, అంబానీలకు కట్టబెడుతోందని ఆరోపించారు. గడిచిన 50 ఏళ్లలో కాంగ్రెస్ ప్రభుత్వం ఆదివాసీ, గిరిజనుల సంక్షేమం కోసం ఉపాధిహామీ, పోడుభూములు, ఐటీడీఏ, రిజర్వేషన్లు తెచ్చిందన్నారు. పది సంవత్సరాలలో బీజేపీ ఏం తెచ్చిందని ప్రశ్నించారు. స్థానిక ప్రజలకు గ్రామసభల ద్వారా గ్రామాలకుండే అధికారాలను తొలగించి అణగతొక్కుతుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం 2006లో అటవీ హక్కులచట్టం, ఐటీడీఏలను తెచ్చి సేద్యం చేసుకుంటున్న గిరిజనులకు అటవీ భూముల పట్టాలను ఇచ్చిందన్నారు. ఆదివాసీ, గిరిజనులు తమ మూలలేంటని తడిమి చూసుకునేందుకే ఈ వర్క్‌షాపు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎక్కడి నుంచి వచ్చాం.. ఏంజరుగుతుంది, మనసంపద మనచేతిలో ఉందా? వివిధ రాష్ట్రాలలో బీజేపీ ఏ విధంగా ఇబ్బందులకు గురిచేస్తుందనేది మాట్లాడుకునేందుకే ఆ సమావేశాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో ప్రొఫెసర్ హరగోపాల్, కంచె ఐలయ్య, వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన మాజీ ఎమ్మెల్యేలు, మాజీ మంత్రులు పాల్గొన్నారు.

త్వరలో స్థానిక సంస్థల ఎన్నికలు

స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించకపోవడం వల్ల గ్రామాల అభివృద్ధి కుంటుపడిందని, కేంద్రం నుంచి రావాల్సిన నిధులు కూడా ఆగిపోయాయని, త్వరలో స్థానిక సంస్థల ఎన్నికలను నిర్వహిస్తామని మంత్రి సీతక్క చెప్పారు. ఆమె నాగార్జునసాగర్‌లో విలేకరులతో మాట్లాడారు. రైతు భరోసాను జనవరి 26 నుంచి అమలు చేస్తామని తెలిపారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగాలేనందున ఎకరాకు రూ.15వేల నుంచి రూ.12 వేలకు తగ్గించినట్లు తెలిపారు. సంక్షేమానికి కేరాఫ్ అడ్రస్గా కాంగ్రెస్ పార్టీ నిలుస్తుందని ఆమె అన్నారు. రైతు భరోసాపై బీజేపీ, టీఆర్ఎస్ పార్టీలు ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని విమర్శించారు.

గోమాతను కాపాడుకోకుంటే గండాలు తప్పవు

- పుష్పగిరి పీఠాధిపతి విద్యాశంకర భారతి మహాస్వామి



జెండా ఊపి పాదయాత్రను ప్రారంభిస్తున్న విద్యాశంకర భారతి మహాస్వామి తదితరులు

చౌటుప్పల్: గోమాతను కాపాడుకోకుంటే సమస్త ప్రాణకోటికి గండాలు తప్పవని పుష్పగిరి పీఠాధిపతి విద్యాశంకర భారతి మహాస్వామి అన్నారు. గోవును జాతీయ ప్రాణిగా ప్రకటించాలని డిమాండ్ చేస్తూ కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు బాలకృష్ణ గురుస్వామి చేపట్టిన మహాపాదయాత్ర ఇటీవల అర్ధాంతరంగా నిలిచిపోగా.. గురువారం చౌటుప్పల్ పట్టణ కేంద్రంలోని శ్రీసత్యదేవ సహిత అయ్యప్పస్వామి దేవాలయం వద్ద తిరిగి ప్రారంభించారు. అంతకు ముందు గోమాత ప్రాముఖ్యతను భక్తులకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గోమాత తిరిగే ప్రాంతంలో సుభిక్షత ఏర్పడుతుందన్నారు. గోవులో సకల దేవతలు ఉంటారని, పాదుగులో మహాలక్ష్మి అమ్మవారు ఉంటారని తెలిపారు. సమస్త మానవాళికి అభయహస్తంగా ఉండే గోవును కాపాడుకోవాలని సూచించారు. గోవును జాతీయ ప్రాణిగా ప్రకటించాలని బాలకృష్ణస్వామి యాత్ర చేపట్టడం గొప్ప విషయమని కొనియాడారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ వెన్‌రెడ్డి రాజు, ఆలయ వ్యవస్థాపక అధ్యక్షుడు బొబ్బిళ్ల మురళి, అధ్యక్షుడు కాంశెట్టి భాస్కర్, గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కేవీబీ.కృష్ణారావు, మండల అధ్యక్షురాలు వెన్‌రెడ్డి సంధ్య, ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఉజ్జిని మంజుల, కోశాధికారి పోలోజు శ్రీలత, స్థానికులు మొగుదాల రమేష్, సుర్వి నర్సింహ, తూర్పాటి శంకర్, చింతల సాయిలు, దేవరపల్లి గోవర్ధన్‌రెడ్డి, అంతటి రాము, కంచర్ల గోవర్ధన్‌రెడ్డి దూడల భిక్షంగౌడ్, దాసోజు భిక్షమాచారి, ముటుకుల్లోజు నీరజ, బొబ్బిళ్ల సంధ్య, ఊడుగు యాదయ్య, వెంకటేశం, పెద్దగోని రమేష్, అనిల్, రాజేష్ పాల్గొన్నారు.

భూతగాదాలతోనే హత్య

- వివరాలు వెల్లడించిన సూర్యాపేట డీఎస్పీ రవి



వివరాలు వెల్లడిస్తున్న సూర్యాపేట డీఎస్పీ రవి

చివ్వెంల(సూర్యాపేట): భూతగాదాల నేపథ్యంలో వ్యక్తిని హత్య చేసిన నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను సూర్యాపేట డీఎస్పీ రవి గురువారం విలేకరులకు వెల్లడించారు. చివ్వెంల మండలం లక్ష్మణ్‌నాయక్‌తండాకు చెందిన ధరావతు శేషు, ధరావతు వెంకన్న, ధరావతు శ్రీనుకు కొద్ది సంవత్సరాలుగా భూమి పంచాయితీ నడుస్తోంది. 2017లో ఘర్షణలు జరిగి ఒకరిపై ఒకరు కేసులు పెట్టుకున్నారు. భూమి విషయమై తమతో తరచూ ఘర్షణ పడుతున్న శేషును చంపాలని ధరావతు వెంకన్న కుటుంబ సభ్యులు ఎదురుచూస్తున్నారు. సూర్యాపేట ఏరియా హాస్పిటల్‌లో పనిచేస్తున్న శేషు డిసెంబర్ 31న విధులు ముగించుకుని రాత్రి 12 గంటలకు ఇంటికి వస్తుండగా లక్ష్మణ్‌నాయక్‌తండా శివారులోని ఎస్సారెస్పీ కాలువ వద్ద ధరావతు వెంకన్న కుమారుడు దీపక్, అతడి స్నేహితులు ధరావతు రాజేష్, ధరావతు సురేష్, జర్పుల ప్రవీణ్ మద్యం తాగుతూ కనిపించారు. ఈ క్రమంలో శేషుతో దీపక్ గొడవ పడి తన స్కూటీలో ఉన్న కత్తి తీసుకుని శేషును పొడిచాడు. దీపక్ స్నేహితులు రాజేష్, సురేష్, ప్రవీణ్ అక్కడి నుంచి పారిపోయారు. దీపక్ వెంటనే తన తండ్రి ధరావతు వెంకన్న, తల్లి సుజాతకు ఫోన్ చేసి ఘటనా స్థలానికి పిలిపించాడు. ముగ్గురూ కలిసి శేషుపై దాడి చేస్తుండగా.. శేషు తన ప్రాణాలను కాపాడుకునేందుకు అక్కడ నుంచి పరిగెత్తుకుంటూ వచ్చి గ్రామ శివారులోని వాంకుడోతు రంగా ఇంటి వెనుక ఉన్న గుడిసెలోకి వెళ్లి దాక్కున్నాడు. దీపక్, అతడి తల్లిదండ్రులు శేషును వెబండించి కత్తితో గొంతు కోసి, మర్మాంగాలు పిసికి హత్య చేశారు. మృతుడి భార్య లలిత ఇచ్చిన ఫిర్యాదు మేరకు సీఐ రాజశేఖర్ ఆదేశాల మేరకు ఎస్ఐ మహేశ్వర్ కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. గురువారం ఆత్మకూర్(ఎస్) మండలం కోటినాయక్‌తండాలో బంధువుల ఇంట్లో ఉన్న దీపక్‌తో పాటు అతడి తల్లిదండ్రులు, ముగ్గురు స్నేహితులను పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ కేసుతో సంబంధం ఉన్న మరో వ్యక్తి ధరావతు శ్రీను పరారీలో ఉన్నట్లు డీఎస్పీ తెలిపారు. నిందితులను పట్టుకున్న సీఐ రాజశేఖర్, ఎస్ఐ మహేశ్వర్, పోలీస్ సిబ్బంది గునగంటి వెంకటేశ్వర్లు, ఎస్. గోవర్ధన్, కె. సుధీర్, ఎం. వెంకటేశ్వర్లును డీఎస్పీ అభినందించారు.

జాతీయ సమైక్యతా శిబిరానికి వలంటీర్ల ఎంపిక

నల్లగొండ టూటౌన్: భారత ప్రభుత్వ క్రీడలు, యువజనుల సర్వీసుల శాఖ ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని నర్సాపూర్‌లో ఫిబ్రవరి 3వ తేదీ నుంచి 9వ తేదీ వరకు నిర్వహించే ఎన్ఎస్ఎస్ జాతీయ సమైక్యతా శిబిరానికి–2025 ఉమ్మడి జిల్లా నుంచి అర్హులైన వలంటీర్లను గురువారం మహాత్మా గాంధీ యూనివర్సిటీలో ఎంపిక చేశారు. భాషా పరిజ్ఞానం, కమ్యూనికేషన్స్ స్కిల్స్, సాంస్కృతిక అంశాల్లో ఇంటర్వ్యూలు నిర్వహించి ఐదుగురిని ఎంపిక చేశారు.

ఎంపికైన వారు వీరే..

బాలుర విభాగంలో: జె. మోహన్, యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాల, మహాత్మాగాంధీ యూనివర్సిటీ, కె. క్రాంతికుమార్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, చండూరు, ఎన్. ధనుష్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, హాలియా

బాలికల విభాగంలో: ఎం. నర్మద, నాగార్జున ప్రభుత్వ డిగ్రీ కళాశాల, నల్లగొండ, డి. మేఘన, టీజీడబ్ల్యూఆర్ఎఫ్ పీడీసీడబ్ల్యూ, భువనగిరి

ఎంపికైన వారిని ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ మద్దిలేటి, వైస్ చాన్సలర్ ఖాజా అల్తాఫ్ హుస్సేన్, రిజిస్ట్రార్ అల్వాల రవి, కొప్పుల అంజిరెడ్డి అభినందించారు. కార్యక్రమంలో కాంతయ్య, చైతన్య, సుధ, స్వప్న పాల్గొన్నారు.

మునుగోడులో దొంగల బీభత్సం

- ఒక్క రాత్రే ఐదు ఇళ్లలో చోరీ



ఆధారాలు సేకరిస్తున్న క్లూస్ టీం

మునుగోడు: మండల కేంద్రంలో బుధవారం రాత్రి దొంగల్ హల్‌చల్ చేశారు. ఒకే రాత్రి వరుసగా ఐదు ఇళ్లలో చోరీకి పాల్పడి పెద్ద మొత్తంలో నగదు, బంగారం, వెండి ఆభరణాలు, ఒక ద్విచక్ర వాహనం ఎత్తుకెళ్లారు. బాధితులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మునుగోడు మండల కేంద్రం శివారులోని బండివడ్డెరగూడేనికి చెందిన ముద్దం నర్సింహ ఇంట్లో అర తులం బంగారం, 30 తులాల వెండి, కొంత నగదు, ఆ పక్కనే ఉన్న రాసమల్ల శ్రీనివాసులు ఇంటి ముందు ఉన్న ద్విచక్ర వాహనం, పట్టణంలోని ప్రధాన కూడలిలో గల నాగార్జున స్వీట్‌హౌజ్ యజమాని జిట్టగొని లింగస్వామి ఇంట్లో రూ.50వేల నగదు, 11 తులాల బంగారం, మార్కండేయ దేవాలయం పక్కనే గల వెనిగల పురుషోత్తం ఇంట్లో రూ.65వేల నగదు, అర కిలో వెండి ఎత్తుకెళ్లారు. అంతేకాకుండా పురుషోత్తం ఇంటి పక్కనే ఉన్న అటవీశాఖ కార్యాలయం తలుపుల తాళాలు పగలగొట్టి అందులో విలువైన వస్తువులు లేకపోవడంతో అక్కడి నుంచి పరారయ్యారు. సీసీ కెమెరాలకు చిక్కకుండా దుండగులు జాగ్రత్త పడ్డారు. శ్రీరాములు ఇంటి ముందు ఎత్తుకెళ్లిన ద్విచక్ర వాహనాన్ని సమీపంలోని వాగులోకి తీసుకెళ్లి ఆర్సీ బుక్, ఇతర పేపర్లను అక్కడే పడేసి వెళ్లారు.

పరిశీలించిన డీఎస్పీ..

నల్లగొండ డీఎస్పీ కె. శివరాంరెడ్డి చండూరు సీఐ వెంకటయ్య, ఎస్ఐ రవితో పాటు కనగల్, చండూరు ఎస్ఐలు చోరీలు జరిగిన ఇళ్లను గురువారం పరిశీలించారు. ఐదు ఇళ్లలో ఒకే ముఠా చోరీలు చేసి ఉంటారా లేదా రెండు, మూడు ముఠాలు చోరీలకు తెగబడ్డారా అనే కోణంలో ఆరా తీశారు. నిందితులను పట్టుకునేందుకు నాలుగు, ఐదు పోలీసు టీంలను ఏర్పాటు చేసి గాలింపు చర్యలు మొదలుపెట్టారు. అంతకుముందు డాగ్ స్క్వాడ్, క్లూస్ టీంను పిలిపించి ఆధారాలు సేకరించారు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

అవమానం భరించలేక వివాహిత ఆత్మహత్య

- దొంగతనం నింద మోపడంతో మనస్తాపం చెందిన మహిళ



రమ్య (ఫైల్)

రామన్నపేట : బంగారం దొంగతనం చేసిందనే నిందను మోపడంతో అవమానం భరించలేక మహిళ ఆత్మహత్య చేసుకుంది. ఈ సంఘటన గురువారం యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండలం సిరిపురం గ్రామంలో చోటు చేసుకుంది. రాపోలు నరేష్, రమ్యలది చేనేత కుటుంబం. వారికి ఇద్దరు సంతానం. ఈ నెల 5న రాపోలు రమ్య(31) రంగారెడ్డి జిల్లా హయత్‌నగర్ మండలం మునగనూరు రామానుజకాలనీలో నివాసం ఉండే తమ బంధువు మేలిడి మానస కుమారుడి పుట్టినరోజు వేడుకలకు హాజరైంది. అదే వేడుకలకు జంగిలి మురళి కుటుంబసభ్యులు కూడా హాజరయ్యారు. ఆ రోజు రాత్రి అక్కడే బసచేశారు. మరుసటిరోజు ఉదయం రమ్య స్వగ్రామం సిరిపురానికి చేరుకుంది. ఆ రోజు సాయంకాలం మానస.. రాపోలు నరేష్‌కు ఫోన్ చేసి మురళి వాళ్లకు సంబంధించిన బంగారం పోయింది మీకేమైనా దొరికిందా అని అడిగింది. కొద్దిసేపటి తరువాత మురళి ఫోన్‌చేసి రమ్యనే బంగారం దొంగిలించిందని గట్టిగా వాదించడంతో పాటు హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్‌లో కేసు పెట్టాడు. హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్ నుంచి ఫోన్ రావడంతో భార్యాభర్తలు ఇద్దరు మరుసటిరోజు స్టేషన్‌కు వెళ్లి పోలీసులను కలిశారు. స్టేషన్‌లో ఎస్ఐ సమక్షంలోనే మురళి అనే వ్యక్తి బంగారం గురించి గట్టిగా దబాయించంతోపాటు, రౌడీలతో కొట్టిస్తానని బెదిరించాడు. బెదిరింపులతో పాటు, అవమాన భారంతో రమ్య మానసిక వేదనకు గురైంది. గురువారం రోజున తిరిగి పోలీస్‌స్టేషన్‌కు రమ్యని పిలువడంతో అవమానం భరించలేక రమ్య తెల్లవారుఝామున చేనేత రంగుల అద్దకంలో ఉపయోగించే నైటాఫ్ అనే రసాయనం తాగింది. భర్తకు విషయం తెలుపగా అంబులెన్స్‌లో రామన్నపేట ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువెళ్లాడు. అక్కడ చికిత్స పొందుతూ రమ్య మృతిచెందింది. తన భార్య ఆత్మహత్యకు కారణమైన జంగిలి మురళిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని మృతురాలి భర్త నరేష్ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. అదేవిధంగా హయత్‌నగర్ ఎస్ఐ సైదులు తన భార్యను దుర్భాషలాడడమే కాకుండా, మురళి తన సమక్షంలోనే బెదిరింపులకు పాల్పడినా పట్టించుకోలేదని విలేకరులకు తెలిపారు. మృతురాలి భర్త ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు రామన్నపేట ఎస్ఐ పి.మల్లయ్య తెలిపారు.

సాగర్ ప్రాజెక్టును పరిశీలించిన ఎస్‌పీఎఫ్ డైరెక్టర్ జనరల్



సాగర్ డ్యాంను పరిశీలిస్తున్న ఎస్‌పీఎఫ్ డైరెక్టర్ జనరల్ అనిల్‌కుమార్

నాగార్జునసాగర్: నాగార్జునసాగర్ ప్రాజెక్టు భద్రతను స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్(ఎస్‌పీఎఫ్) డైరెక్టర్ జనరల్ అనిల్‌కుమార్ గురువారం పరిశీలించారు. ప్రాజెక్టు లెఫ్ట్ కెనాల్ హెడెరెగ్యులేటర్ వద్ద అనిల్‌కుమార్‌కు ఎస్‌పీఎఫ్ డిప్యూటీ కమాండెంట్ కోటేశ్వర్‌రావు స్వాగతం పలికారు. అనంతరం ప్రాజెక్టు మెయిన్ డ్యాం ఎంట్రన్స్ నుంచి చివరి వరకు కాలినడకన వెళుతూ పది డ్యూటీ పోస్టులను అనిల్‌కుమార్ పరిశీలించారు. డ్యాం అంతర్భాగం, ప్రధాన విద్యుదుత్పాదన కేంద్రం, కుడి, ఎడమ కాల్వలపై గల విద్యుదుత్పాదన కేంద్రాల వద్దగల డ్యూటీ పోస్టులను పరిశీలించారు. రాత్రి, పగలు విధులు నిర్వహించే సమయంలో ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సాగర్ ప్రాజెక్టు భద్రతపై ఉన్నత స్థాయిలో సమీక్ష ఉన్నందున తమకు అవగాహన కోసం నాగార్జునసాగర్‌కు వచ్చినట్లు తెలిపారు. డీజీ అనిల్‌కుమార్ వెంట నల్లగొండ ఏఎస్పీ రాములునాయక్, మిర్యాలగూడ డీఎస్పీ రాజశేఖర్‌రాజు ఉన్నారు. సాగర్‌డ్యాం చారిత్రక విశేషాలను పర్యాటక శాఖ గైడ్ సత్యం వివరించారు.

హత్య కేసులో భార్యాభర్తలకు జీవితఖైదు

చివ్వెంల(సూర్యాపేట): యువతిని హత్య చేసిన భార్యాభర్తలకు జీవితఖైదు విధిస్తూ సూర్యాపేట జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎస్. గోవర్ధన్‌రెడ్డి గురువారం తీర్పు వెలువరించారు. ఖమ్మం జిల్లా కూసుమంచి మండలం జక్కపల్లి గ్రామానికి చెందిన పోలూరి సతీష్‌కు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఎన్టీఆర్ కృష్ణా జిల్లా వత్సవాయి మండలం వేములనర్వ గ్రామానికి చెందిన మాధవితో 2017 అక్టోబర్‌లో వివాహం జరిగింది. సతీష్ విద్యుత్ ఏఈగా పనిచేస్తుండగా, మాధవి ఇంట్లోనే ఉంటోంది. 2017 నవంబర్ 27న మాధవి తన మరిది నరేష్‌తో కలిసి బైక్‌పై కోదాడకు బయల్దేరింది. మార్గమధ్యలో కోదాడ పట్టణ శివారులోని అనురాగ్ కాలేజీ వద్ద మాధవి తమకు తెలిసిన గౌతమ్ అనే వ్యక్తి వద్ద స్కూటీ తీసుకుని తన స్నేహితురాలు మౌనిక వద్దకు వెళ్లి వస్తానని నరేష్‌కు చెప్పి వెళ్లింది. గంట తర్వాత ఫోన్ చేస్తానని నరేష్ వద్ద ఉన్న మరో ఫోన్ తీసుకుని మాధవి వెళ్లింది. ఎంతసేపటికీ మాధవి ఫోన్ చేయకపోవడంతో నరేష్ తన సోదరుడు సతీష్‌కు సమాచారం ఇచ్చాడు. సతీష్ ఫోన్ చేసినా మాధవి ఫోన్ ఎత్తలేదు. అదే రోజు సాయంత్రం నరేష్ కోదాడ పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. అదే సమయంలో కోదాడ పట్టణంలోని షిరిడీ నగర్ డాక్టర్ హెచ్‌ఆర్ పాఠశాల వద్ద దేవరపల్లి సురేందర్‌రెడ్డికి చెందిన ఇంట్లో మహిళ మృతి చెందినట్లు పోలీసులకు ఫోన్ రావడంతో.. పోలీసులతో పాటు నరేష్ అక్కడకు వెళ్లి చూడగా.. తన వదిన మాధవి విగతజీవిగా కనిపించింది. మృతురాలి భర్త సతీష్ ఫిర్యాదు మేరకు అప్పటి ఇన్‌స్పెక్టర్ రజితారెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

చున్నీతో గొంతు నులిమి హత్య..

దర్యాప్తులో భాగంగా పోలీసులకు విస్తుపోయే నిజాలు వెలుగులోకి వచ్చాయి. మాధవి తాను కాలేజీ చదివే సమయంలో లెక్చరర్ గండు వంశీకృష్ణను ప్రేమించింది. ఆయనకు అప్పటికే వివాహం జరిగగా.. ఆయన తన భార్యతో కలిసి కోదాడ పట్టణంలోని దేవరపల్లి సురేందర్‌రెడ్డి ఇంట్లో అద్దెకు ఉంటున్నాడు. అప్పుడప్పుడు మాధవి, వంశీకృష్ణ ఇద్దరు ఫోన్‌లో మాట్లాడుకునేవారు. దీంతో వంశీకృష్ణను అతడి భార్య పలుమార్లు మందలించింది. మాధవికి పెళ్లి అయిన తర్వాత కూడా వంశీకృష్ణ ఆమెకు ఫోన్ చేస్తుండటంతో.. తనను ఇబ్బంది పెట్టవద్దని, తన భర్తతో కలిసి వేరే ప్రాంతానికి వెళ్తున్నానని మాధవి చెప్పింది. దీంతో 2017 నవంబర్ 27న వంశీకృష్ణ తన భార్యను బంధువుల ఇంటికి పంపించాడు. అనంతరం మాధవికి ఫోన్ చేసి ఒక్కసారి వచ్చి తనతో మాట్లాడిపోవాలని కోరడంతో ఆమె వంశీకృష్ణ అద్దెకు ఉంటున్న ఇంటికి వచ్చింది. భర్తపై అనుమానంతో వంశీకృష్ణ భార్య తిరిగి వారు అద్దెకు ఉంటున్న వచ్చి చూడగా.. వంశీకృష్ణ, మాధవి ఇద్దరూ ఏకాంతంగా ఉండటం కిటికీలో నుంచి చూసి తన ఫోన్‌లో వీడియో తీసింది. వెంటనే వెళ్లి గది తలుపు కొట్టగా.. వంశీకృష్ణ తలుపు తీశాడు. 'మీరు ఏకాంతంగా ఉండటం వీడియో తీశాను.. మాధవిని చంపేద్దాం, లేదంటే అందరికీ వీడియో చూపిస్తాను' అని వంశీకృష్ణను అతడి భార్య బెదిరించడంతో ఇద్దరూ కలిసి మాధవిని చున్నీతో గొంతు నులిమి హత్య చేశారు. మాధవి వద్ద ఉన్న బంగారం తీసుకుని అక్కడ నుంచి పరారయ్యారు. మృతురాలి భర్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు వంశీకృష్ణను, అతడి భార్యను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ కేసు తుది విచారణలో భాగంగా పలువురు సాక్షులను విచారించిన సూర్యాపేట జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎస్. గోవర్ధన్‌రెడ్డి పబ్లిక్ ప్రాసిక్యూటర్ కొంపెల్లి లింగయ్య వాదనలతో ఏకీభవిస్తూ నిందితులు ఇద్దరికి జీవితఖైదుతో పాటు రూ.500 జరిమానా విధిస్తూ గురువారం తీర్పు వెలువరించారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్‌కు లైజన్ ఆఫీసర్ కె. సురేంద్రబాబు, కోర్టు హెడ్‌కానిస్టేబుల్ బి. వెంకటరమణ సహకరించారు.

సిమెంట్ మాఫియా అరెస్ట్

- లూజ్ సిమెంట్‌ను అక్రమంగా విక్రయిస్తున్న ముఠా



పోలీసుల తనిఖీల్లో పట్టుబడిన సిమెంట్ బస్తాలు



వివరాలు వెల్లడిస్తున్న నల్లగొండ డీఎస్పీ శివరాంరెడ్డి, చిత్రంలో పోలీస్ సిబ్బంది

నల్లగొండ: లారీల్లో లూజ్ సిమెంట్‌ను అక్రమంగా రవాణా చేస్తూ వివిధ కంపెనీలకు చెందిన పేర్లతో బస్తాల్లో నింపి విక్రయిస్తున్న ఐదుగురు ముఠా సభ్యులను నల్లగొండ టాస్క్‌ఫోర్స్, చిట్యాల పోలీసులు పట్టుకున్నారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను గురువారం నల్లగొండ డీఎస్పీ శివరాంరెడ్డి తన కార్యాలయంలో విలేకరులకు వెల్లడించారు. ప్రముఖ సిమెంట్ కంపెనీల్లో వేయింగ్ మిషన్ వద్ద పనిచేసే వ్యక్తులతో కొంతమంది కుమ్మక్కై లారీల్లో మోతాదుకు మించి లూజ్ సిమెంట్‌ను నింపి బయటకు వచ్చిన తర్వాత ఆ సిమెంట్‌ను బ్లాక్ మార్కెట్‌లో అమ్ముకుంటూ సొమ్ము చేసుకుంటున్నారు. ఒక లారీలో 35 టన్నుల లూజ్ సిమెంట్ నింపాల్సి ఉండగా.. 37 టన్నులు నింపి ఎక్కడైతే సిమెంట్ డెలివరీ చేయాలో అక్కడ 35 టన్నులు అన్‌లోడ్ చేసి మిగిలిన 2 టన్నుల సిమెంట్‌ను నల్లగొండ జిల్లా చిట్యాల సమీపంలో కొంతమంది వ్యక్తులకు అమ్ముతూ సొమ్ము చేసుకుంటున్నారు. ఇలా లూజ్ సిమెంట్‌ను కూడబెట్టి సంబంధిత కంపెనీల పేరున నకిలీ బస్తాలు తయారుచేసి బహిరంగం మార్కెట్‌లో అమ్ముకుంటూ అక్రమంగా సంపాదిస్తున్నారు. నల్లగొండ ఎస్పీ శరత్‌చంద్ర పవార్ ఆదేశాల మేరకు నల్లగొండ టాస్క్‌ఫోర్స్, చిట్యాల పోలీసులు తమకు అందిన సమాచారం మేరకు చిట్యాల సమీపంలో లూజ్ సిమెంట్ తరలిస్తున్న గుండాల నవీన్, గుండాల దుర్గయ్య, గుండాల శ్రీను, పెరిక జయనరసింహ, రమణయ్యను అరెస్ట్ చేశారు. లింగస్వామి అనే వ్యక్తి పరారీలో ఉన్నట్లు డీఎస్పీ తెలిపారు. వారి నుంచి రూ.4లక్షల విలువైన 1500 బస్తాల సిమెంట్, ఒక లారీ స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. ఇంకా 30 మంది డ్రైవర్లు ఈ దందాలో ఉన్నట్లు గుర్తించామని వారిని కూడా త్వరలో పట్టుకుంటామన్నారు. ఈ కేసును ఛేదించిన టాస్క్‌ఫోర్స్ సీఐ రమేష్‌బాబు, చిట్యాల సీఐ నాగరాజు, ఎస్ఐ ధర్మ, టాస్క్‌ఫోర్స్ ఎస్ఐలు శివప్రసాద్, మహేందర్, పోలీస్ సిబ్బందిని డీఎస్పీ అభినందించారు.

'ముక్కోటి'కి ముస్తాబైన యాదగిరిగుట్ట

- నేడు ఉదయం 5.15 గంటలకు ఉత్తర ద్వారం గుండా భక్తులకు దర్శనమివ్వనున్న లక్ష్మీనరసింహుడు



ఉత్తర మాడ వీధిలో భక్తుల కోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక గ్యాలరీలు

యాదగిరిగుట్ట: ముక్కోటి ఏకాదశి వేడుకకు యాదగిరిగుట్ట ఆలయం ముస్తాబైంది. ఆలయ ఉత్తర మహా రాజగోపురం ద్వారం నుంచి శుక్రవారం ఉదయం వైకుంఠనాథుడి అలంకరణలో యాదగిరీశుడు భక్తులకు దర్శనం ఇచ్చేలా అధికారులు ఏర్పాట్లు చేశారు. ఆలయ మాడ వీధుల్లో తొక్కిసలాట జరగకుండా, భక్తులు ఇబ్బందులు పడకుండా గ్యాలరీలు ఏర్పాటు చేశారు. భక్తుల రద్దీకి అనుగుణంగా లడ్డూ, పులిహోర ప్రసాదం అందుబాటులోకి తీసుకొచ్చినట్లు ఈఓ భాస్కర్ రావు వెల్లడించారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఉత్తర మాడ వీధిలో ఏర్పాటు చేసిన గ్యాలరీల్లో సుమారు 5వేల మంది భక్తులు కూర్చునే విధంగా కుర్చీలు సిద్ధం చేశారు.

ఉదయం 5.15గంటలకు ద్వార దర్శనం..

ఆలయాన్ని శుక్రవారం వేకువజామున 2 గంటలకే తీయనున్నారు. 2గంటల నుంచి 2.30గంటల వరకు సుప్రభాతం, అనంతరం 3గంటల వరకు ప్రాతఃకాల తిరువారాధన, 3గంటల నుంచి 3.30 వరకు తిరువైప్పా సేవకాలం, 3.30 నుంచి 4.15 బాలభోగం, ఆరగింపు, 4.15గంటల నుంచి 5:15గంటల వరకు స్వామి వారి అలంకార సేవ, 5:15గంటలకు ఉత్తర ద్వారం గుండా స్వామివారు దర్శనమిస్తారు. 5:30 నుంచి 6.30వరకు ఉత్తర ద్వార దర్శనం, మంగళ వాయిద్యం, చతుర్వేద వేద పారాయణం, వైకుంఠ ఏకాదశి విశిష్టత ఉపన్యాసం, ఉదయం 6:30 నుంచి 7:45గంటల వరకు తిరువీధి సేవ, 8గంటల నుంచి 9:30గంటల వరకు అధ్యయనోత్సవ పురవీధి సేవ, 8గంటల నుంచి మధ్యాహ్నం 12:30గంటల వరకు సర్వ దర్శనాలు, 9:30గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు స్వామివారికి అధ్యనోత్సవ తిరుమంజన స్నపనం, మధ్యాహ్నం12:30గంటల నుంచి 1:30గంగల వరకు మధ్యాహ్న రాజభోగం నిర్వహించనున్నారు.

పాతగుట్ట ఆలయంలో..

యాదగిరి క్షేత్రానికి అనుబంధంగా ఉన్న పూర్వగిరి లక్ష్మీనరసింహస్వామి వారి ఆలయాన్ని కూడా వేకువజామునే తీసి సుప్రభాతం, ఆరాధన, సేవాకాలం జరిపిస్తారు. 5.15గంటలకు ఉత్తర ద్వార దర్శనం అనంతరం స్వామివారి సేవ పురవీధుల్లో ఊరేగింపు, అలంకార సేవ దర్శనం ఉండనున్నాయి.

నేడు అధ్యయనోత్సవాలకు శ్రీకారం

యాదగిరిగుట్ట ఆలయంలో శుక్రవారం నుంచి 15వ తేదీ వరకు అధ్యయనోత్సవాలు నిర్వహించనున్నారు. ఆరురోజుల పాటు ఉదయం, సాయంత్రం పురపాట్ సేవలు, వేద పారాయణాలు, స్వామివారి అలంకార సేవలు నిర్వహిస్తారు.

అలంకార సేవలు ఇలా..

శుక్రవారం ఉదయం గరుడ వాహనంపై వైకుంఠనాథుడిగా, సాయంత్రం మత్స్యావతారం, 11వ తేదీ శనివారం ఉదయం వేణుగోపాల శ్రీకృష్ణాలంకారం, సాయంత్రం గోవర్ధనగిరిధారి అలంకారం, 12వ తేదీ ఆదివారం ఉదయం శ్రీరామావతారం, సాయంత్రం శ్రీవెంకటేశ్వరస్వామి అలంకారం, 13వ తేదీ సోమవారం ఉదయం వెన్నకృష్ణుడి అలంకారం, సాయంత్రం కాళియమర్ధనుడి అలంకారం, 14వ తేదీ మంగళవారం ఉదయం వటపత్రసాయి అలంకారం, సాయంత్రం వైకుంఠనాథుడి అలంకారంలో పరదపద ఉత్సవం, 15వ తేదీ బుధవారం ఉదయం లక్ష్మీనరసింహ స్వామి వారి అలంకారంలో భక్తులకు స్వామివారు దర్శనమిస్తారు.

నిత్య కల్యాణం, హోమం రద్దు..

అధ్యయనోత్సవాలను పురస్కరించుకొని ఆలయంలో ప్రతిరోజు భక్తులచే నిర్వహించే నిత్య, శాశ్వత కల్యాణం, శ్రీసుదర్శన నారసింహ హోమం, బ్రహ్మోత్సవాలు, జోడు సేవలను ఆరురోజుల పాటు రద్దు చేస్తున్నట్లు ఆలయాధికారులు వెల్లడించారు. శుక్రవారం లక్షపుష్పార్చన, ఆర్జిత నిజాభిషేకం, సహస్రనామార్చన సైతం రద్దు చేశారు.